
# ఏవ్యా హాపీ?

పెనుమాక నాగేశ్వరరావు.



“ఒక్కొక్కరికి పాతిక సంవత్సరాల వయసొచ్చింది, స్నేహితులకు గ్రీటింగ్ కార్డ్ పంపించాలంటే మీ నాన్నకి భయపడుతున్నావంటే మిమ్మల్నేం అనుకోవాలా’ వ్యంగ్యమూ కోపమూ మేళవించి అన్నాడు సుదర్శనరావు మేనళ్ళు ఇద్దర్నీ ఉద్దేశించి.

మామయ్య మాటలకు ఉక్రోషం కలిగినా తలలు వంచుకోక తప్పలేదు రమేష్కు, సురేష్కు.

“ఆయనకు ఇలాంటివన్నీ నచ్చవన్నయ్యా. తెలిస్తే ఊరుకోరు. అందుకే అయనన్తో గొడవెందుకులెమ్మని వాళ్ళ నాన్నగారికి తెలీకుండా తంటాలు పడుతుంటారు” కొడుకులు. ఇద్దర్నీ సమర్థించింది అప్పుడే వంటగదిలో నుంచి బయటకు వచ్చిన సరోజనమ్మ.

“నువ్వా ఆయనకి తగిన అర్ధాంగివేనమ్మా. అడ్డాలనాడు బిడ్డలుగాని గడ్డాలనాడు బిడ్డలా అంటారు విన్లేదామ్మా.. అయినా ఇలాంటి చిన్నచిన్న విషయాలకి కూడా భయపడటం ఏంటమ్మా” కాస్తంత విసుగు కూడా ధ్వనించింది సుదర్శనరావు గొంతులో.

“భయం కాదులే మామయ్యా.. అయనకు ఇష్టంలేని పనికదా.. అనవసరంగా ఆయన్తో వాదన ఎందుకులే. ఇలాంటివి నాన్నకు తెలీకుండా చేసుకుంటే పోతుందిగదా అని.. అంతకన్నా ఏం లేదు” చెప్పాడు రమేష్.

“ఆయన పాతకాలం మనిషి. సంప్రదాయాలు, ఆచారాలు అంటుంటారే తప్ప ఈ కాలం పోకడలు ఆయనకు గిట్టవ్. ఈ కంప్యూటర్ యుగంలో స్పీడ్ ఎందుకనో ఆయనకి అయిష్టం. అందుకనే మేం చేసే ఇలాంటి పనులన్నీ ఆయనదాకా పోకుండా కామ్‌గా చేసేసుకుంటుంటాం” అన్నకు వంత పలికేడు సురేష్.

“అసలు గ్రీటింగ్ కార్డ్స్ పంపడమూ, ఉత్తరాలు రాసుకోవడమూ పాతబడిపోయినై. ఇంటర్‌నెట్‌లు, ఈమెయిల్స్ కాలం వచ్చేసింది. మారుతున్న కాలానికి అనుగుణంగా మనమూ మన ఆలోచనల్ని, పద్ధతుల్ని మార్చుకోవాలి కానీ ఇంకా ఆ పాత కాలంలోనే పాతుకుని వుంటాను అంటే ఎలాచెప్పండి

# స్నేహమేరా జీవితం!

స్నేహం సృష్టిలో అతి కమ్మని బంధం. మంచి స్నేహానికి మించిన బంధం మరొకటి లేదు. అయితే ఈ బంధంలో నిజాయితీ ముఖ్యం. కొందరు వ్యక్తులు అవసరానికి స్నేహం చేస్తుంటారు. తమ అవసరం తీరిపోగానే మనల్ని పలకరించడం అటుంచితే కనీసం మర్యాదకైనా ఓ చిరునవ్వు కూడా నవ్వరు. అలాంటి వారిని చూస్తే స్నేహం అన్న పదానికి అర్థమే మారిపోయినట్లు అనిపిస్తుంది.



నిజమైన స్నేహం స్నేహితుల కష్టసుఖాల్లో పాలు పంచుకొని, వారిని సరైన మార్గంలో నడిపించగలగాలి. స్నేహంలో స్వార్థం ఉండకూడదు. మన అవసరానికి ఎదుటివారిని ఉపయోగించాలనుకొని స్నేహం చేస్తే అది మన వ్యక్తిత్వాన్ని దిగజారుస్తుంది. స్నేహితుల నుంచి సహాయ సహకారాలను ఆశించడం తప్పు కాదు. కానీ ఎంతసేపూ ఎదుటివారిని ఉపయోగించుకోవడమే పనిగా పెట్టుకోకుండా, తాము వారికి ఏ విధంగా ఉపయోగపడగలమో ఆలోచించాలి. స్నేహితుల మధ్య ఈర్ష్యా, అసూయలకు తావు ఉండకూడదు. ధనిక, బీద అన్న తేడా అసలే పనికి రాదు. జీవితాంతం ఒకరి కష్టసుఖాల్లో మరొకరు తోడుగా నిలబడగలిగితే అదే నిజమైన స్నేహం అవుతుంది. నిస్వార్థమైన స్నేహం కల కాలం నిలుస్తుంది. మంచి స్నేహితులు లభించడం కష్టతరమే అయినప్పటికీ స్నేహితుల ఎంపికలో జాగ్రత్త తీసుకుంటే కలకాలం స్నేహాన్ని కాపాడుకోవడం కష్టతరం కాదేమో!

**- ఎమ్.నాగలక్ష్మి**

మీ నాన్నకూ..." ఉపదేశంలా చెప్పాడు సుదర్శనరావు.

"మమ్మల్ని చెప్పమనకపోతే, నువ్వే నాన్నాగారితో చెప్పవచ్చుగా మామయ్యా" అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు సురేష్.

"అవున్నిజమే.. నువ్వు మాకంటే పెద్దోడివి. మా నాన్నంటే భయం లేనోడివి. నువ్వు చెప్తేనే బాగుంటుంది మామయ్యా" బలవంతం చేస్తున్నట్టు అన్నాడు రమేష్.


కొడుకులిద్దరూ తన తమ్ముడ్ని ఆటపట్టిస్తుంటే ముసిముసిగా నవ్వుకుంటూ నిల్చున్న సరోజని.

"అవున్రా సుదర్శనం.. వాళ్ళు చెప్పింది నిజమే. నువ్వు చెప్పాలనుకున్నవీ, అడగాలనుకున్నవీ.. అన్నీ మీ బావగార్ని నువ్వే అడిగేసేయ్ ముఖాముఖీ. ఆయనగారేం సమాధానం చెప్తారో నాకూ వినాలనే వుంది" అన్నది సరోజని.

"ఏమిటి అక్కయ్యా నువ్వు కూడా.. బావగారితో నేను మాట్లాడాల్సినంత ముఖ్యమైన విషయమా ఇది.. వాళ్ళేం హైస్కూలు పిల్లలా, ఎలిమెంటరీ స్కూలు పిల్లలా, ఇంట్లో తండ్రి దగ్గరే నీళ్ళు నమిల్తే ఇక బయటవాళ్ళ దగ్గర వీళ్ళెందుకు పనికొస్తారు చెప్పు" తప్పించుకునే ప్రయత్నం చేశాడు సుదర్శనరావు.

"ఈ ఒక్కసారికీ నువ్వు మాట్లాడరా. వాళ్ళకీ కొంత ధైర్యం వస్తుంది. ఇకనుంచీ నువ్వు చెప్పినట్లే వాళ్ళే ఆయన్తో మాట్లాడుకుంటారు. నువ్వు కాస్త నేర్పు మరీ" వచ్చే నవ్వుని బలవంతంగా ఆపుకుంటూ అన్నది సరోజని.

నీళ్ళు నమలసాగాడు సుదర్శనరావు. బిత్తరచూపులు, అప్పుడే ముఖంలో రంగులు మారసాగినై. ఈ ఆపద నుంచి బయటపడే మార్గం తోచక సతమతమైపోసాగాడతను.




"సరే మామయ్యా.. నాన్న రాగానే ఈ ప్రస్తావన ప్రారంభించు. నువ్వెలా అడుగుతావో.. ఆయనెలా సమాధానం చెప్తారో.. అన్నీ గమనించి ఇకముందు మేమూ ధైర్యం తెచ్చుకుంటాం" వ్యంగ్యం కన్పించకుండా అన్నాడు సురేష్.

"సరేలేవోయ్... మీ నాన్నతో మాట్లాడటానికి నాకేం భయమా? అయినా ఇలాంటి విషయాల్లో నేనస్సలు రాజీ పడను. ఎవరి అభిరుచులు వాళ్ళకి ఉంటాయ్‌రా. మీ అభిరుచుల్ని అడ్డుకోవటం ఆయనకి తగదు. సరే.. రానీయండి గట్టిగా అడిగేస్తా.. నాకేం భయం లేదు..." అన్నాడు గొప్పగా, ధీమాగా.

"ఏంటయ్యా విశేషం ఏమిటో రంకెలేస్తున్నావ్?" అడుగుతూనే లోపలికి వచ్చాడు గోపాల్రావు.

ఒక్కసారిగా ఖంగుతిన్న సుదర్శనరావు నోట మాట రాలేదు. నోరు తెరిచి ఆయనవైపే గుడ్లప్పగించి చూస్తూ నిల్చుండిపోయాడు.

తండ్రి రాకతో గదిలోకి తుర్రుమన్నారు కొడుకులిద్దరూ. వంటపనికోసమని అనవసరమైన హడావిడి నటిస్తూ అటుగా అడుగు వేసింది వడివడిగా సరోజని.

పులి, పిల్లి హాల్లో మిగిలిపోయారు.

"ఆ .. రంకెలా పాడా.. మీ కొడుకులిద్దరూ నన్ను ఆట పట్టిస్తున్నారంతే" తెచ్చిపెట్టుకున్న ధైర్యంతో నంగి నంగిగా చెప్పాడు సుదర్శనరావు.

"అదేం కాదులే.. ఇంట్లో తండ్రి దగ్గరే నీళ్ళు నములుత్తే.. అంటూ ఏదేదో హితబోధ చేస్తున్నట్టున్నావ్ నువ్వే.. - వాకిట్లోనే కాస్తంత వినిపించాయ్ నీ మాటలు.. ఏమిటి సంగతి" అడిగాడు సూటిగా గోపాల్రావ్.

"అబ్బే.. హితబోధా నా బొందా.. నేనేం హితం చెప్పగల్ను"

"వయసులో వాళ్ళకంటే పెద్దవాడివేగదయ్యా. పైగా మేనమామవు కూడానూ. అమ్మ తర్వాత అమ్మలాంటివాడంటారు కదా మేనమామని. వాళ్ళకి హితవుచెప్పేందుకు అర్హత ఎవరికుంటుంది నీకంటే?"

"ఏం లేదు బావగారూ అబ్బాయిలిద్దరూ వాళ్ళ స్నేహితులకు గ్రీటింగ్ కార్డ్స్ పంపాలనుకుంటున్నారు. అలాంటివన్నీ మీకు ఇష్టం వుండవనీ, మీకు ఆ విషయం తెలిస్తే కోపగించుకుంటారని వాళ్ళు భయపడు తుంటేనూ" అని ఆగిపోయాడు సుదర్శనరావు.

"వాళ్ళు భయపడుతుంటే నువ్వు ధైర్యం చెపుతున్నావన్నమాట..

అంతేగా?"

"అలా అని కాదూ.. ఇలాంటి చిన్నచిన్న విషయాలక్కూడా.." అర్ధోక్తిగా ఆగాడు.

"నువ్వు చెప్పింది అక్షరాలా నిజమేనయ్యా. ఒక వయసు వచ్చాక, పిల్లలు, ఇలాంటి చిన్నచిన్న విషయాలక్కూడా తల్లితండ్రుల దగ్గర భయపడటం ఖచ్చితంగా ఖండించవలసిన విషయమే. కాదనను. తరాల అంతరాల మూలంగా అభిరుచుల్లో తేడాలుంటాయ్. వాటిని ఉభయులూ చర్చించుకోవాలి. ఏది మంచిదో ఎందుకు మంచిదో ఒకవేళ మంచిది కాకపోతే ఎందుకు కాదో నిర్ణయించుకోవాలి.. అప్పుడు భయం పోయి, విజ్ఞానం పెరుగుతుంది. ఆలోచన పెరుగుతుంది. స్వంత నిర్ణయాలు తీసుకోగలిగే శక్తి వస్తుంది."

"నా ఉద్దేశం కూడా అదే బావగారూ" కాస్తంత ధైర్యం కలిగిన మీదట స్పష్టంగా చెప్పగలిగాడు సుదర్శనరావు.

"వాళ్ళ సంగతి అలా వుంచు. కనీసం నీకైనా అర్థమైందా! నాకిలాంటివన్నీ ఎందుకు నచ్చవో? డబ్బులు ఖర్చయిపోతాయని కాదయ్యా నేను వీటిని వ్యతిరేకించేది?" అని బావమరిది ముఖంలోకి సూటిగా చూశాడు గోపాలరావు.

"ఛ ఛ అలా అని నేనెందుకు అనుకుంటాను బావగారూ" అన్నాడు.

"నువ్వు ఎలా అనుకున్నా, నా పిల్లలు ఎలా అనుకున్నా నిజం మాత్రం అదే. నేనుడబ్బుకోసం కాదు ఇలాంటివాటిని ప్రోత్సహించంది. అసలు ఈ అలవాట్లు మనకి ఎలా సంక్రమించాయో తెల్సా.. కేవలం వ్యామోహం. నాగరికత అంటే ఇలా జనవరి ఒకటవ తారీకుల కరచాలనాలు చేసుకుంటూ హేపీ న్యూయర్ చెప్పుకోవమూ, దూర ప్రాంతాల్లో వున్నవారికి గ్రీటింగ్ కార్డ్స్ పంపుకోవడమూ అని భ్రమలో పడి ఎవర్నో అనుకరిస్తూ, ఆలోచన లేకుండా బ్రతికేస్తున్నారయ్యా మనవాళ్ళు."

తండ్రి ఆవేశం లేకుండా చెప్తున్న మాటలు ఆలకించేందుకు గదిలోంచి బయటకు వచ్చారు కొడుకులు ఇద్దరూ. వంట గదిలోంచి బయటకు వచ్చింది సరోజని కూడా.

"ప్రతిరోజూ ఉదయం నిద్ర లేవంగానే, మరలా రాత్రి నిద్రకుపక్రమించే ముందూ, వీలయితే మధ్యాహ్నం కూడా 'సర్వేజనా సుఖినో భవంతు' అని కోరుకునే గొప్ప సంప్రదాయం మనది. అది వదిలేసి జన్మకో శివరాత్రి అన్నట్లు ఏడాదికి ఒక్కరోజు హేపీ న్యూ ఇయర్ అంటూ కపటంగా పలకటం సమర్థనీయమా ఆలోచించు."

"ఆ ఒక్కరోజూ మనం బాగుపడటం ఏమాత్రం ఇష్టంలేని వ్యక్తులు కూడా, నవ్వుతూ హేపీ న్యూయర్ అని మొక్కుబడిగా చెప్పటం ఎందుకో నాకు నచ్చదు సుదర్శనం."

"సంవత్సరంలో ఆ ఒక్కరోజు హేపీ న్యూయర్ చెప్పటం తప్ప మళ్ళీ జనవరి ఒకటి వచ్చే లోపు కనీసం ఆర్యూ హేపీ? అని అడిగేవాళ్ళున్నారా? బజార్లో తారసపడినప్పుడు కూడా ఫలానా షేర్లు కొన్నావా? ఫలానా స్కీములో చేరేవా? ఇంటిపైన ఇల్లు కట్టావా? కొడుకు పెళ్ళికి కట్నం ఎంత తీసుకున్నావ్? లేకపోతే పిల్లల్ని స్కూల్లో చేర్చేందుకు డొనేషన్లు ఎంత కట్టావనో అడిగేవాళ్ళే, ఆ ఆలోచన్లు చేసేవాళ్ళేగానీ, పెళ్ళాం పిల్లలు కులాసాగా వున్నారా? నీవు ఆరోగ్యంగా ఉన్నావా అని మనసు విప్పి ఆత్మీయంగా పలకరించేవాళ్ళు కరువైపోవటం నిజం కదూ!"

"**మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే**"నన్న కారల్ మార్క్స్ మహాశయుని మాట నిజమే... నిజమే.. నిజమే అని నిరూపించటానికి ఎంతైనా కృషి చేస్తున్న మనుషులు, "స్వంత లాభం కొంత మానుకుని పొరుగువానికి సాయపడవోయ్" అన్న గురజాడ వారి మాటల జాడ ఎవ్వరైనా ఏమాత్రమైనా పాటిస్తున్నారా?...


... నేను, నాది, అనే స్వార్థం పెరిగి, పెరిగి ఈ పైపై పలకరింపులూ, హేపీ న్యూయర్లూ ఎందుకనయ్యా నా ఆవేదనా.."

"మీరు చెప్పింది ముమ్మాటికీ యదార్థం బావగారూ నేనూ మీతో ఏకీభవిస్తున్నాను" అన్నాడు సుదర్శనరావు.


"అవును నాన్నగారూ మాకు మీరు చెప్పిన మాటలు ఆలోచన కలిగించినై. ఇక ముందు భయం లేకుండా మీతో మా ఆలోచనల్ని పంచుకుంటాం" అన్నారు కొడుకులిద్దరూ.

"సర్లే.. అన్నం వడ్డిస్తా.. రండి భోజనాలకు" అంటూ తొందరపెట్టింది సరోజని.

దె ఆర్ హేపీ. *




## మావిడాకులు గుమ్మానికి కట్టడంలో పరమార్థం



మనం వివాహాది శుభ కార్యాలలో మావిడాకులను కట్టడం మన సంప్రదాయం, ఆచారం. ఇందులో ఆరోగ్యసూత్రం కూడా ఇమిడి ఉంది. సాధారణంగా శుభకార్యాల సందర్భంలో ఎక్కువ సంఖ్యలో బంధువులు ఒకేచోట గుమికూడడం జరుగుతుంది. ఇలాంటప్పుడు ఉచ్ఛ్వాస, నిశ్వాసలలో ఉండే ఆక్సిజన్, కార్బన్ డై ఆక్సైడ్‌ల మధ్య సమతుల్యంలో తేడా వస్తుంది. ఈ సమయాలలో మనం తోరణాలుగా కట్టిన మావిడాకులు ఈ సమతుల్యాన్ని కొంత వరకు తీరుస్తాయి. మావిడాకులను తెంపిన కొన్ని గంటల వరకు వాటిల్లో శ్వాసక్రియ జరుగుతూనే ఉంటుంది. అందుకని శుభకార్యాల్లో మనం వదిలే కార్బన్ డై ఆక్సైడ్‌ను ఈ మావిడాకులు గ్రహించి ఆక్సిజన్‌ను వదలడం ద్వారా మనకు అవసరమయ్యే ఆక్సిజన్ ఆ మావిడాకుల ద్వారా లభిస్తుంది. ఈ విధంగా ఆరోగ్యసూత్రం ఇమిడి వున్నందునే శుభ పుణ్య కార్యాలలో ఈ మావిడాకుల ఉపయోగం విస్తృతమయ్యి, సంప్రదాయక రూపంలో విశేషతను పొందింది.

- విశ్వసాయి రాజారావు